◈ ఈ వారం కథ

# మొక్కుబడి

— బడబాగ్ని అరుణ కుమారి.

చుట్టూ చీకటిగా వుంది. కళ్ళు చికిలించి చేతి వాచీలోకి చూశాను. రేడియం డయల్ వాచీ– పన్నెండు గంటలు దాటినట్లు చూపిస్తోంది.

అమ్మను 'అమ్మ'గా చూడగలనా అన్న అనుమానంతో కూడిన నా ఆశలాగే, దూరంగా స్ట్రీట్ లైట్లు మినుకు, మినుకుమని బలహీనంగా కాంతిని వెదజల్లాలని ప్రయత్నిస్తు న్నాయి.

ఎడమ భుజం మీది రెండేళ్ళ పాపను, కుడి చేతిలో బరువుగా వున్న సూట్‌కేస్‌నూ మోయడం నాకు కష్టంగానే వుంది. నాకు రెండడుగుల వెనకే నా శ్రీమతి ఎనిమిది నెలలు నిండిన చంటాడితో అలసటగా నన్ను అనుసరిస్తోంది.

అమ్మకు ఏమైంది? "మదర్ సీరియస్ స్టార్ట్ ఇమ్మీడియట్లీ" అంటూ మొన్న రాత్రి వచ్చిన టెలిగ్రామ్‌లో నా మనసేదో కీడు శంకిస్తోంది. అమ్మను ఎట్లాంటి పరిస్థితుల్లో చూడవలసి వస్తుందో– తెలియక.

ఆటో డ్రైవర్లందరినీ వరుసగా లేపుతూ – "పెద్ద గుంటు పల్లె వరకు వస్తావా!" అని అడగడం–

"అమ్మో! ఆ రూటా, ఆ లూటీలు జరిగే రూట్లో, అందునా ఆడోల్లను కూడా తీసుకొని..." అని సమాధానాలు చెపుతున్నారు.

"బాబూ! ప్లీజ్ నువ్వెంత చార్జీ అడిగినా ఇస్తాను. కాద నకు!" అంటూ మరొక డ్రైవర్‌ను ప్రాధేయపడ్డాను.

"అది కాద్సార్! మీ ఊరు దూరమని నేను కాదనడం లేదు. ఆ రూట్ మంచిది కాదు. పైగా – ఆడమనిషి, పిల్లోల్లు వుండారు. బద్రం కావల్లని సెప్తావుండా. మీకు అంత ధైర్నంగా వుంటే పదాండి దించేసి వస్తా!" అంటూ పది కిలో మీటర్ల దూరానికి 'ఎనభై రూపాయ లు' చార్జీ డిమాండ్ చేసి ఒప్పుకున్నాడు.

ఆ రూట్‌లో ఈమధ్య జరిగిన దోపిడీల గురించి, మాన భంగాల గురించి–ఆటో డ్రైవర్ అప్పడప్పుడూ వెనక్కి తిరిగి నా మొహంవైపు చూస్తూ చెపుతున్నాడు.

అతను నా వైపు చూసినపుడు – అతని 'మనసు' మొహంలో – చదవాలని ప్రయత్నిస్తున్నాను. నా శ్రీమతికీ అదే భయం కల్గినట్లుంది. ఒక చేత్తో బిడ్డను దగ్గరికి పొదివి పట్టుకొని, మరో చేత్తో మెడలోని బంగారాన్ని పైటమాటున దాచేస్తూ – నా దగ్గరగా జరిగి ఒదిగి కూర్చుంది.

రోడ్డుకు ఇరువైపులా వున్న చేలు, గుట్టల్లోంచి – నక్కల ఊళలు వినిపిస్తున్నాయి. అవి విన్నప్పడల్లా – దొంగల సంకే తాలు – ఇలాగే వుంటాయని ఇంతకు ముందు డ్రైవర్ చెప్పిన మాటలు గుర్తువచ్చి భయం పుట్టి – ఒళ్ళంతా ప్రాకు తోంది. భయాన్ని కప్పిపుచ్చుకోవటానికి డ్రైవర్ని మాటల్లోకి దించాను.

"మీ సొంతవూరు ఏది బాబూ!" అంటూ. నిజానికి అత నికి నా వయస్సే వుంటుంది. కాని, నా ఆఫీసరు దర్పం



**"తల్లి చావు బతుకుల్లో వుందని తెలిసినప్పుడు కష్టనష్టాలను తల్చుకుని వెళ్లకుండా వుండలేం గదా! ఎవరూ చెయ్యలేని సాహసాన్ని చేసిన ఆ ఆటో డ్రైవర్‌కు అందుకే అడగనంత కిరాయి ఇచ్చాను. అయితే, పాపం అతనే భార్యా పిల్లలకు దూరమైపోయాడు! నా మూలంగానే అతనికి దుర్మరణం ప్రాప్తించిందని బహిరంగంగా చెప్పకోలేకపోయినా 'అంతరాత్మ' ఊరుకుంటుందా?**

అతన్ని అలా పిలిచేటట్టు చేసింది.

"సిద్ధిపేటసార్!" అతడు జవాబు చెప్పాడు. ఇంకేదో చెబుతున్నాడు.

ఆ మాటల్లోనే మా ఊరు వచ్చేసింది. నా ప్రాణం, నా శ్రీమతి మాన, ప్రాణాలు, విలువైన నగలు అన్నిటినీ మించి నా పిల్లలు- ఇంత మందిని భద్రంగా ఊరు చేర్చినందుకు - డ్రైవర్‌కు ఎంత ఇచ్చినా తక్కువే అవుతుందనిపించింది ఆ క్షణంలో.

జేబులోంచి వందరూపాయల నోటు తీసి డ్రైవర్ చేతిలో పెట్టాను. వద్దనకుండా తీసుకొని ఒకసారి నళ్ళు నిరుచుకొని - ఆటో ఎక్కి స్టార్ట్‌చేసి "పోయొస్తా సార్" అంటూ వెళ్లిపోయాడు.

మళ్ళీ - అమ్మ గురించి ఆందోళన మనసులో చోటు చేసుకోగా - వడి వడిగా ఇంటికేసి నడిచి - తలుపు తట్టేను.

రెండు నిముషాల తరువాత ఆవలిస్తూ తలుపు తీసిన అమ్మను చూసి ప్రయాణపు బడలిక అంతా మరచిపోయి-

"అమ్మా! నీ ఆరోగ్యం ఎలా వుంది!" ఆత్రంగా అడిగాను.

"ముందు లోపలికి రండర్రా చెపుతాను!" అంటూ కోడల్ని, పిల్లల్ని పలుకరించి, పాలు పొయ్యిమీద పెట్టి పొయ్యి రాజెయ్యడానికి ఉపక్రమించింది.

అలికిడికి లేచినట్టున్నాడు నాన్న- వచ్చి యోగక్షేమాలడిగి, నా మొహంలోని భావాలను చూసి కాబోలు-

"మరేం లేదు. నువ్వా...! దేవుడు, దయ్యం, మంచి, చెడ్డలనేవి పట్టించుకోవాయె. పూజలు, వ్రతాల పాడే నీకు గిట్టదు. నీ మాట కాదని, పాపం కోడలు పిల్ల మాత్రం ఏం చేస్తుంది? ఆ కీడు వల్లో ఏం పాడో- నీ మొదటి బిడ్డ పురిటిలోనే చచ్చిపోయె. అదీ మగనలుసు.

ఆ తరువాత ఏదో ఈ ఆడబిడ్డ తరువాత నీకు మగ పిల్లోడు పుట్టినాడు. వాడికా తొమ్మిదో నెలలో పడింది. అందుకని-

మనమందరమూ 'ఇలీర్థం' పోయి ఆ వెంకట్రమణస్వామికి తలనీలాలు సమర్పించుకుని పిల్లాడి ఒంటి మీదున్న మొక్కుబడి సొమ్ములు హుండీలో వేసేసి మొక్కు తీర్చుకుని వస్తామని మీ అమ్మ, నేను యోచన చేసుకుని,

"ఇట్లా... అంటే నువ్వు రావేమో అనుకొని ఆ మాదిరిగా టెలిగ్రామ్ ఇప్పిమన్నాయ్-" తాపీగా అసలు విషయం బయటపెట్టాడు నాన్న. నాన్న మాటలతో సస్పెన్స్ విడిపోయి విషయం తెలిసింది కాని- వీరికి తెలియకుండానే వీరి 'సెంటిమెంట్స్' ఎన్ని ప్రాణాల్తో చెలగాటమాడాయని తలచుకొంటూనే- నాలో ఆవేశం కట్టలు తెంచుకుంది.

"మీ మొక్కుబడి తీర్చుకునే మార్గం ఇంతకంటే వేరే ఏమీ దొరకలేదా?" చిరాకునూ, అసహనాన్ని అణచిపెట్టడానికి ప్రయత్నిస్తూ అన్నాను.

నమ్మకాలుండడంలో తప్పలేదు గాని- నిర్హేతుకమైన నమ్మకాలతో ముప్పు 'కొని'తెచ్చుకోవడం ఎంత అనారోగ్యకరమైన అలవాటు.

ఆలోచిస్తూ ఎప్పుడు నిద్రలోకి జారిపోయానో కాని, ఉదయాన్నే శ్రీమతి పిలుపుతో మేల్కొన్నాను.

"ఈ దినం మంచి దినమట. మన తిరుమల ప్రయాణం ఈ దినమే. త్వరగా లేవండి. మన ఊరి బస్సు వచ్చేలోపు 'రడీ' అవ్వాలి కదా!" అంది.

హూ! ఇంత జరిగాక తప్పతుందా అనుకొంటూ లేచాను.

* * *

మా ఊరి నుంచి గతుకుల రోడ్డు మీద పడిలేస్తూ మెయిన్ రోడ్డెక్కింది బస్సు.

రెండు మూడు కిలోమీటర్లు పరిగెత్తాక నెమ్మదిగా 'స్లో' అయి, తరువాత నిలిచిపోయింది.

ఏమిటి సంగతని రోడ్డు మీదికి దృష్టి సారించాను. రోడ్డు పొడవునా ట్రాఫిక్ జామ్ అయివుంది.

బస్సు డ్రైవర్ తల బయటికి పెట్టి విషయం కనుక్కున్నట్లున్నాడు. అసహనంతో నొసలు చిట్లించాడు.

ప్రయాణికుడెవరో 'విషయాన్ని' డ్రైవర్ నుంచి రాబట్టుకుని బస్సులో అనౌన్స్ చేశాడు.

"ఆ నాలుగో నెంబరు మైలురాయి దగ్గర అదెవరో ఆటో డ్రైవర్ చచ్చిపడున్నాడట" అని.

ఇంక వారి 'కామెంట్స్' వింటూంటే రాత్రి ఆటో డ్రైవర్ అన్న మాటలు గుర్తుకువచ్చాయి. "పది రూపాయిలు దొరుకుతుందన్నా, ప్రాణాలు తీయడానికి వెనుకాడని లుచ్చా లూటీగాళ్ళున్నారు సార్" నాలో ఏదో అనుమానం పుట్టి బుర్రంతా ప్రశ్నార్థకంగా మారింది.

వెంటనే బస్సు దిగి ముందుకు వెళ్ళి, గుంపును తప్పించుకుని అతనికేసి చూశాను. మమ్మల్ని భద్రంగా మా వూరు చేర్చిన ఆ ఆటో డ్రైవర్ అతను!

నా శ్రీమతి- "ఏం జరిగిందండీ!" అంటూ నా సమాధానం కోసం చూడకుండా గుంపులోంచి నిక్కి నిక్కి తొంగిచూసి నమ్మలేనట్లు నావైపు చూసింది.

పోలీసుల ప్రశ్నలకు ఏడుస్తూ సమాధానం చెప్తున్న డ్రైవర్ భార్యతో-

"అమ్మా! జరిగిందేదో జరిగిపోయింది. ఇక నువ్వు బాధపడి ప్రయోజనం లేదు. మీ దీన స్థితి చూస్తుంటే నాకు జాలి కలుగుతోంది. నువ్వు ధైర్యంగా వుండి నీ పిల్లలకు ధైర్యం చెప్పు!" అన్నాను.

ఆ మాటలు వింటూనే ఆమె దుఃఖం రెట్టింపయింది.

ఆమె ఏడుస్తూనే నాకు రెండు చేతులెత్తి దండం పెట్టింది. నేనెందుకు వారిపట్ల అంత జాలి చూపిస్తున్నానో తెలిస్తే దండం పెట్టిన ఆ చేతులే దుమ్మెత్తిపోసేవేమో! ◆

